సాక్షి కుమురం భీం

శనివారం, 15, మార్చి, 2025



అభివృద్ధికి ఆదర్శంగా నార్నూర్

నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద సమగ్ర అభివృద్ధి మోడల్‌గా నార్నూర్ మండలం నిలుస్తోంది. పీఎం అవార్డ్స్ కోసం టాప్ 30లో ఒకటిగా ఎంపికైంది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:22	ఆది : 5:08

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.5 /25.5

పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం కూడా పూర్తిగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న వర్కర్లు

ఆసిఫాబాద్‌రూరల్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్లు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దినకర్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్లకు ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. హోలీ పండుగ రోజు సైతం సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాల వర్కర్లు రాము, పద్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కౌటాల(సిర్పూర్): హోలీ పండుగ సందర్భంగా వాగులు, నదుల్లో స్నానాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని, అధికారులు ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తూ.. ఈ నెల 13న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'కావొద్దు.. విషాదం' అనే కథనానికి అధికారులు స్పందించారు. పండుగ నేపథ్యంలో కౌటాల మండలం తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున పంచాయతీ కార్యదర్శి అనూష సిబ్బందితో హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. మద్యం తాగి నదిలో స్నానాలకు వెళ్లొద్దని, లోతు ప్రాంతాల వైపు ఎవరూ సాన్నాలు చేయొద్దని బోర్డులు ఏర్పాటు చేశారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాల మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. వారు మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని శాసనసభ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెన్షన్ వేటు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అలీబిన్ అహ్మద్, సంజీవ్ కుమార్, పెంటు, అజయ్‌కుమార్, మల్లేశ్, నిసార్, రాజు, తుకారాం, శ్రీధర్, భీమేశ్, వినోద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో ఇఫ్తార్



విందుకు హాజరైన ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, తదితరులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ సర్కార్ పనిచేస్తుందన్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఎఫ్‌వో నీరజ్ టిబ్రేవాల్, డీఎస్పీ రామానుజం, ఎఫ్‌డీవో సుఖ్‌దేవ్ బోబడే తదితరులు హాజరయ్యారు.

'దురాడి' సంబురం



ఆదివాసీ గ్రామాల్లో శుక్రవారం దురాడి (రంగోత్సవం) సంబురంగా జరుపుకొన్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. - వివరాలు 9లో▸

రంగుల సంబురం



సంబురాల్లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ కుటుంబ సభ్యులు



రంగులు పూసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ఎస్పీ శ్రీనివాసరావుకు రంగు పూస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



కాగజ్‌నగర్‌రూరల్: కార్మికుడికి బొట్టుపెడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



కలెక్టర్‌తో కలిసి సంబురాల్లో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు



రంగులు పూసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా దంపతులు



దప్పు వాయిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



కలెక్టర్‌కు రంగు పూస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

ఆసిఫాబాద్: జిల్లావ్యాపంగా రంగుల పండుగ హోలీ సంబురాలు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలతోపాటు అన్ని మండలాల్లో ఉదయం నుంచే చిన్నారులు కేరింతలు కొడుతూ రంగులు చల్లుకున్నారు. జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్, బ్రాహ్మణవాడ, బజార్‌వాడి, జన్కాపూర్, సందీప్‌నగర్, తారకరామానగర్‌లో పిల్లలు, యువతీ యువకులు సందడి చేశారు. క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్లు సంబురాలు జరుపుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ ఆర్.ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ రామానుజం, డీసీఆర్బీ డీఎస్పీ కరుణాకర్, పోలీసు అధికారులు స్టెప్పులు వేస్తూ ఉల్లాసంగా గడిపారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, ఆర్‌ఐలు పెద్దన్న, అంజన్న, సీఐలు రవీందర్, సత్యనారాయణ, స్వామి, సీసీ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి బ్యాండ్ మేళాతో నృత్యాలు చేస్తూ బ్రాహ్మణవాడ, రావులవాడ, పొట్టి శ్రీరాములు చౌక్, అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు ఎకిరాల శ్రీనివాస్, చిలువేరి వెంకన్న, పాత శ్రీనివాస్, ముక్క కృష్ణమూర్తి, కట్కూరి కిశోర్, రావుల శంకర్, గుండ ప్రమోద్, కాచం వినేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు అనుమాండ్ల శ్రీకాంత్, అల్లె శ్రీకాంత్, కోమటిపెల్లి లింగయ్య, సభ్యులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో వాసవీ క్లబ్ సభ్యులు..



పోలీసు అధికారులతో ఎస్పీ శ్రీనివాసరావు



ఆసిఫాబాద్‌రూరల్: రంగుడబ్బాలతో చిన్నారులు

ఏఐ బోధనకు సిద్ధం

- జిల్లాలో నాలుగు పాఠశాలలు ఎంపిక
- ఒక్కో పాఠశాలలో పది మంది విద్యార్థులకు బోధన
- కనీస సామర్థ్యాల పెంపే లక్ష్యం
- నేటి నుంచి తరగతులు ప్రారంభం

జిల్లాలో ఎంపికైన పాఠశాలలు

మండలం	పాఠశాల	విద్యార్థులు
రెబ్బెన	తక్కళ్లపల్లి	10
కెరమెరి	గోయగాం	10
వాంకిడి	ఖిరిడి	10
బెజ్జూర్	సలుగుపల్లి	10



ఏఐ బోధనకు ఎంపికైన కెరమెరి మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాల

కెరమెరి(ఆసిఫాబాద్): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచేందుందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందు కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీ సాయం తీసుకునేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొదటి విడతలో నాలుగు ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ పాఠాలు బోధించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే విద్యాశాఖ 1 నుంచి ఐదో తరగతి వరకు ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం అమలు చేస్తోంది. ఉపాధ్యాయులకు శిక్షణ అందించడంతోపాటు టీచింగ్, లర్నింగ్, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, హ్యాండ్‌బుక్స్ ముద్రించి సరఫరా చేస్తున్నారు. ఏఐ టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ ఏఐ ద్వారా ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం మరింత మెరుగ్గా అమలు చేయనున్నారు.

నేటి నుంచి ప్రారంభం..

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏఐ వినియోగం పెరిగింది. అన్నిరంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హవా నడుస్తోంది. ఈ సాంకేతికత సాయంతో ప్రాథమిక విద్య మరింత బలోపేతం కానుంది. పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని నాలుగు ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. శనివారం నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏఐ కార్యక్రమాలు చేపట్టనున్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రేతోపాటు అదనపు కలెక్టర్లు, అధికారులు ఆయా పాఠశాలల్లో ఏఐ బోధనను అధికారికంగా ప్రారంభించనున్నారు.

పది మంది విద్యార్థులు ఎంపిక..

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు ఆశించిన స్థాయిలో అభ్యసన సామర్థ్యాలు, చతుర్విధ ప్రక్రియల్లో వెనుకబడుతున్నారు. ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నా ఫలితాలు మెరుగుపడడం లేదు. ఈ నేపథ్యంలో 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో సీ గ్రేడ్‌లో ఉన్న సామర్థ్యాలను మెరుగుపర్చడం కోసం చర్యలు చేపట్టారు. జిల్లాలోని తక్కళ్లపల్లి, గోయగాం, ఖిరిడి, సలుగుపల్లి ప్రాథమిక పాఠశాలల నుంచి పది మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేశారు. ఆయా స్కూళ్లలో వెనుకబడిన విద్యార్థులను ఏఐ పాఠాల కోసం సంసిద్ధం చేశారు. ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు సమీప ఉన్నత పాఠశాలల్లోని కంప్యూటర్లను వినియోగించనున్నారు.

బోధన ఇలా..

ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా పిల్లలను ఆకట్టుకునేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన సాగనుంది. 3, 4, 5 తరగతుల నుంచి ఎంపిక చేసిన విద్యార్థుల నుంచి ఐదుగురి చొప్పున ఒక బ్యాచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో బ్యాచ్‌కు తెలుగువాచకం, గణితం అభ్యాసాలపై 20 నిమిషాల వ్యవధిలో ఏఐ పాఠాలు బోధించనున్నారు. సదరు విద్యార్థి పాఠ్యాంశం అర్థం చేసుకుంటున్నాడా..? లేదా అని గుర్తించి.. అర్థం కాకుంటే సరైన మార్గంలో బోధన సాగిస్తుంది. ప్రతీ విద్యార్థి అభ్యసన సామార్థ్యాలు మదింపు చేయడంతోపాటు గతంతో పోలిస్తే పురోగతి ఎలా ఉందో పరిశీలించి నివేదిక రూపొందించనున్నారు. వారంలో నాలుగు రోజులు ఏఐ పాఠాల బోధన సాగనుంది.

విద్యార్థులకు ఉపయోగం



ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపునకు ప్రస్తుతం ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమల్లో ఉంది. మరింత మెరుగైన సామర్థ్యాలు సాధించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలో మొదటి విడతలో నాలుగు ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశాం. ఆయా పాఠశాలల్లో శనివారం నుంచి ఏఐ బోధన ప్రారంభమవుతుంది. విద్యార్థులకు చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి సామర్థ్యాల పెంపుకు ఏఐ ఎంతో ఉపయోగపడుతుంది.

– ఉప్పులేటి శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

మేలుకో.. తెలుసుకో..



రెండేళ్ల క్రితం తాండూరు మండలం కాసిపేటకు చెందిన కస్తూరి శివకృష్ణ జిల్లా కేంద్రంలోని ఓ షోరూంలో బైక్ కొనుగోలు చేశాడు. ఆ బైక్ బ్యాటరీ రెండేళ్ల వారంటీ ఉండగా.. ఏడాదికే పాడైంది. దీనిపై షోరూం వాళ్లను అడిగితే కి.మీ. సాకు చూపిస్తూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి షోరూంపై న్యాయపోరాటం చేస్తున్నాడు.

మంచిర్యాలకు చెందిన వెంకటేశ్ ఆన్‌లైన్ ఉత్పత్తుల కంపెనీపై ఫిర్యాదు చేశాడు. తనకు నాసిరకం వస్తువు అంటగట్టారని ఆ కంపెనీపై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు.

మంచిర్యాలకు చెందిన శ్రవణ్‌కుమార్ సినిమా థియేటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా వాహనాల పార్కింగ్ ఫీజులు తీసుకుంటున్నారని వినియోగదారుల కోర్టులో ఫిర్యాదు చేశాడు. థియేటర్ లోపల తినుబండారాలు, శీతల పానీయాలను ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు విక్రయిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. ఈ రెండూ ప్రస్తుతం విచారణలో ఉన్నాయి.

- వస్తువు చిన్నదైనా.. పెద్దదైనా.. మోసాలే
- తయారీ, తూకం, నాణ్యత, ధరల్లో మాయాజాలం
- సేవల్లో వినియోగదారులకు తప్పని తిప్పలు
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం



ఓ రేషన్ షాపులో 50కిలోలకు తక్కువగానే ఉన్న బియ్యం సంచి (ఫైల్)



వస్తువు తూకం వేసే ముందు ఇలా జీరో ఉండాలి..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వినియోగదారులు నాణ్యమైన సేవలు పొందడంలో చాలా చోట్ల మోసపోతూనే ఉన్నారు. డబ్బులు చెల్లించి కంపెనీ ఉత్పత్తుల పేర్లు, బరువు, నాణ్యత, కల్తీ, ఉత్పత్తుల్లో మోసాలతోపాటు నిబంధనల మేరకు సర్వీస్ అందడం లేదు. నిత్యం వినియోగించే ఉప్పు, పప్పు నుంచి తినే తిండే, తాగే నీళ్ల, విలువైన వస్తువులు మార్కెట్‌లో జరిగే ప్రతీ లావాదేవీలు, పౌరసేవల్లో మోసం, నిర్లక్ష్యం తప్పడం లేదు. వస్తువులు, సరుకులు కొనుగోలు చేసే సమయంలో అవగాహన లోపం, సేవలు పొందడం తెలియక చాలామంది వినియోగదారులు మోసపోతున్నారు. చాలా సంస్థలు నాసిరకం వస్తువులు, సరుకులు తయారు చేసి వినియోగదారులకు అంటగడుతున్నాయి. వినియోగదారుల ప్రయోజనాలను పూర్తిగా తుంగలో తొక్కుతున్నాయి. దీనిని నివారించేందుకు కేంద్రం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. ఇదివరకు ఏ వస్తువునైనా షాపులోకి వెళ్లి నేరుగా కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం చాలా మంది ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో మోసాలు సైతం మరింతగా పెరిగిపోతున్నాయి. హక్కులను మరింతగా రక్షించేందుకు కన్జూమర్ కమిషన్ కీలకపాత్ర పోషిస్తుంది.

ప్రశ్నిస్తేనే న్యాయం

వినియోగదారుల సంరక్షణ చట్టం ప్రకారం తయారీ, నాణ్యత, తూకం, ప్రామాణిక ముద్ర, గడువు, ధర, జీఎస్టీ, తదితరాలు కచ్చితంగా ఉండాలి. చెల్లించిన ధరకు సేవలు పొందాలి. కానీ ఎక్కడైనా సేవల్లో అంతరాయం ఏర్పడితే కొందరే ప్రశ్నిస్తున్నారు. న్యాయం కోసం పోరాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలోనే వినియోగదారుల వివాదాల పరిష్కారానికి కమిషన్ ఉంది. 2024లో మొత్తం 163 ఫిర్యాదులు రాగా, ఇందులో 29 పరిష్కరించగా, మరో 134 పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని కేసుల్లో ఆయా కంపెనీల, తయారీదారులపైనా జరిమానాలు విధించారు. ప్రస్తుతం వినియోగదారులు ఆన్‌లైన్‌లోనూ సెంటర్ అండర్ కన్జూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సీసీసీ), ఈ జాగృతి వెబ్‌సైట్, హెల్ప్‌లైన్ 1915కు కాల్ చేయొచ్చు.

హక్కులు, బాధ్యతలు ఉన్నాయి

వినియోగదారులకు నాణ్యమైన సేవలు పొందే హక్కులు ఉన్నాయి. అదే సమయంలో బాధ్యతలు ఉన్నాయి. ప్రతీ ఒక్కరు తమ హక్కులు పొందేలా అవగాహన ఉండాలి. మా సంస్థ తరఫున మోసపోయిన వినియోగదారులకు మద్దతుగా నిలుస్తున్నాం.

–టి.చేతన సోనీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వినియోగదారుల హక్కుల సంస్థ

వేల కేసుల పరిష్కారానికి చొరవ చూపింది. నష్టపోయినదానికంటే అధికంగా పరిహారం అందించి బాధితులకు అండగా నిలిచింది. జిల్లాలో పలువురు విని యోగదారుల హక్కులపై పోరాటం చేస్తున్నారు. ఆయా సంబంధిత శాఖ అధికారులు నిత్యం తనిఖీలు చేస్తూ.. పర్యవేక్షించాల్సిన అవసరం ఉన్నా చూసీచూడనట్లుగా వదిలేయడంతో వినియోగదారులకు నష్టం జరుగుతోంది.

అవగాహనే శ్రీరామ రక్ష..

ప్రజల శ్రేయస్సు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తీసుకొచ్చినా అవగాహన లేమితో అవి మెరుగైన ఫలితాలను సాధించడం లేదు. ప్రస్తుత సాంకేతిక యుగంలోనూ ఎందరో వినియోగదారులకు తమ హక్కులపై సరైన చైతన్యం లేకుండా పోయింది. తమకు జరిగిన అన్యాయంపై కనీసం ఫిర్యాదు సైతం చేయకుండా పోతున్నారు. నచ్చిన వస్తువుల సేవలు ఎంచుకోవడంతో పాటు వాటి నాణ్యత, పనితీరు గురించి తెలుసుకోవడం, అభిప్రాయం తెలియజేయడం తదితర హక్కులు వినియోగదారులకు ఉంటాయి. వస్తుసేవల విషయంలో సమస్య తలెత్తితే వాటి విలువ ఆధారంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిషన్లను ఆశ్రయించవచ్చు.

క్లుప్తంగా

గొల్లపల్లిశివారులో అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి పెను ప్రమాదం తప్పింది. గ్రామశివారు ఒర్రెలోని పొదలకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. దాదాపు అర కిలోమీటర్ మేర మంటలు వ్యాపించాయి. ఎస్సీ కాలనీ అతి సమీపానికి మంటలు రావడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. పోలీసులు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది గంటపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. కొంత ఆలస్యమైన కాలనీలోని ఇళ్లన్నీ బుగ్గిపాలయ్యేవని ప్రజలు పేర్కొన్నారు. సకాలంలో ఫైరింజన్ చేరుకోవడంతో ముప్పు తప్పిందన్నారు. ఎస్సై ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జీవితంపై విరక్తితో సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య



శ్రీధర్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జీవితంపై విరక్తితో సింగరేణి ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై దివాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని గర్మిళ్లకు చెందిన సింగరేణి ఉద్యోగి వీర్ల శ్రీధర్ (43) సింగరేణి ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవ పడేవాడు. మద్యం మానేయాలని భార్య శ్రీకరి మందలించడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. గురువారం రాత్రి ఇంట్లో తన గదిలో లుంగీతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు రోహన్, వచ్చన్ ఉన్నారు.

మద్యం మత్తులో యువకుడు..



రవి (ఫైల్)

కౌటాల: మద్యం మత్తులో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..మండలం గురుడుపేట గ్రామానికి చెందిన తలండి రవి (27) గతకొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం మద్యం మత్తులో హోలీ ఆడి రాత్రి తాగిన మైకంలో ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి తలండి చిన్నన్న ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమగ్ర అభివృద్ధికి ఆదర్శంగా నార్నూర్

- పీఎం అవార్డ్–2025 కోసం..
- నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ)కి ఎంపిక
- 426 ఆస్పిరేషనల్ బ్లాక్స్‌లో టాప్ 30లో నార్నూర్



ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా, నీతి ఆయోగ్ ప్రోగ్రాం అధికారులు (ఫైల్)

నార్నూర్: నాడు ఆదిలాబాద్ జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల్లో నార్నూర్ మండలం మొదటి స్థానంలో ఉండేది. ఇక్కడి ఆదివాసీ గిరిజనుల జీవనాధారం వ్యవసాయం కాగా మౌలిక వసతుల లేమి, పరిమిత జీవనోపాధి అవకాశాలతో వెనుకబడి ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. నేడు ఈ మండలం నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద ఒక సమగ్ర అభివృద్ధి మోడల్‌గా నిలుస్తోంది. ఈ మార్పు ఒక్కరోజులో దక్కింది కాదు.. పలు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, సీఎస్ఆర్ భాగస్వామ్యాల సమష్టి కృషి ఫలితం.

జనవరి 7, 2023న నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద నార్నూర్ ఎంపికైంది. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమగ్రత వంటి కీలక రంగాల్లో పనితీరు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జూన్ 2023 నాటికి దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకుంది. డెల్టా ర్యాంకింగ్‌లో ఇది గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. దీనికి గుర్తింపుగా నార్నూర్ బ్లాక్‌కు రూ.కోటి ప్రోత్సాహక నిధి మంజూరైంది. ఇది అభివృద్ధి లక్ష్యాల సాధనలో స్ఫూర్తిదాయక ఘట్టం. అంతే కాదు.. పీఎం అవార్డ్స్ 2024 కోసం 426 ఆస్పిరేషనల్ బ్లాక్స్‌లో టాప్ 30లో ఒకటిగా నార్నూర్ ఎంపికైంది.

- ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ (ఏబీపీ) కేటగిరీలో ప్రధానమంత్రి ప్రశస్తి అవార్డు–2024 రెండో రౌండ్‌కు నార్నూర్ బ్లాక్ ఎంపికైన సందర్భంగా ఈనెల 10న సోమవారం ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాజర్షి షా పాల్గొని బ్లాక్‌లో అమలు చేసిన ముఖ్యమైన కార్యక్రమాలు ముఖ్య విజయాలను ప్యానెల్‌కు సమర్పించారు.

వ్యవసాయం– నీటి నిర్వహణ: స్థిరమైన అభివృద్ధి దిశగా

- హార్టికల్చర్‌లో మిల్లెట్ ఫార్మింగ్, డ్రిప్ ఇరిగేషన్, బీఏఐఎఫ్ చేపట్టడం.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భాగస్వామ్యంతో సుంగాపూర్, ఖంపూర్ గ్రామాల్లో చెక్ డ్యామ్‌లు నిర్మించి రైతులకు నీటి వనరులు మెరుగుపరిచే చర్యలు.
- దీర్ఘకాలిక సాగు కోసం సోలార్ బోర్‌వెల్స్, నీటి సంరక్షణ కార్యక్రమాల అమలు
- జల్ ఉత్సవంలో భాగంగా 500కు పైబడిన ప్రజలు నీటి పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం, నీటి నాణ్యత మెరుగుదల

ఆరోగ్యం–పోషణ, సంక్షేమం వైపు అడుగులు..

- వందశాతం ఏఎన్‌సీ నమోదు, సురక్షిత ప్రసవ సేవలు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు
- గిరిజన పోషణ మిత్ర ప్రోగ్రాం అమలుతో ఆశ్రమ పాఠశాల(బాలికల)ల్లో రక్తహీనత నివారణకు చర్యలు
- లంచ్ బాక్స్ సర్వీస్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కుటుంబాలకు చెందిన గర్భిణులకు పోషకాహారం అందించేలా చర్యలు
- ఎన్‌క్యూఏఎస్, రెడీ హెల్త్ సెంటర్స్, పీఎం జన్‌మన్ ఎంఎంయూ హెల్త్ క్యాంపుల ద్వారా గ్రామీణ ఆరోగ్య సంరక్షణను పెంపొందించడం.

విద్య, స్మార్ట్ క్లాసులు– నూతన మార్గదర్శకాలు

- స్మార్ట్‌క్లాసులు, ఐసీటీ ల్యాబ్స్, వర్చువల్ లెర్నింగ్ ద్వారా విద్యార్థులకు డిజిటల్ విద్య అందించడం.
- ఇస్రో, ఎన్ఆర్ఎస్‌సీ, టీ–హబ్ ఎక్స్‌పోజర్ విహారయాత్రల ద్వారా విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రం– ఇన్నోవేషన్ అవగాహన కల్పించడం.
- యంగ్ ఓరేటర్స్ క్లబ్, ఇంగ్లిష్ లిటరసీ ప్రోగ్రాం, పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం.
- ఆరోగ్య పాఠశాల ద్వారా ఆరోగ్యం, మానసికోల్లాసం, వ్యక్తిత్వ వికాసంపై ఆరు రోజుల ప్రత్యేక శిక్షణ.

మహిళా సాధికారత, ఆర్థికవృద్ధి

- 601 స్వయం సహాయక సంఘాలు, 6,721 మహిళా సభ్యులు, ఆర్థిక స్వావలంబన లక్ష్యం.
- మహువా లడ్డూ ప్రాజెక్ట్, సంప్రదాయ ఆహారాన్ని ఆదాయ వనరుగా మార్చడం.
- పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాలు, మహిళలు– యువత కోసం వ్యాపార అవకాశాలు కల్పించడం.
- నైపుణ్య అభివృద్ధి శిక్షణ, సైకత శిల్పం, డిజిటల్ స్కిల్స్–బ్యాంబూ క్రాఫ్ట్‌పై ప్రత్యేక శిక్షణ.

భవిష్యత్ దిశగా ముందడుగు

- 100 శాతం ఎన్‌క్యూఏఎస్ హెల్త్ సెంటర్ సర్టిఫికేషన్.
- గిరిజన మ్యూజియం ఏర్పాటుకు ప్రణాళికలు.
- ఆర్‌వో వాటర్ ప్లాంట్స్, కమ్యూనిటీ లైబ్రరీలు మరింత విస్తరణ
- మహిళల ఆరోగ్యంపై అవగాహన, టెలీమెడిసిన్ క్లినిక్స్.
- డిజిటల్ విద్య, స్మార్ట్ క్లాసులను మరింత అభివృద్ధి చేయడం.

దేశ గ్రామీణ అభివృద్ధికి ఒక మార్గదర్శకం



ఆస్పిరేషనల్ బ్లాక్‌గా మారిన నార్నూర్ ఇప్పుడు దేశంలోని గ్రామీణ అభివృద్ధికి గొప్ప మోడల్‌గా నిలుస్తోంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి పనిచేయడం ద్వారా సాధ్యమైన విజయగాథ ఇది. అభివృద్ధి కొనసాగుతూ, ప్రజల సంక్షేమానికి మరింత ప్రాముఖ్యత ఇస్తూ నార్నూర్ అభివృద్ధి జ్ఞాపకంగా నిలుస్తుంది. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు కల్పించడానికి ముందడుగు వేస్తాం.

– రాజర్షిషా, కలెక్టర్, ఆదిలాబాద్

నూతన ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తన

- నార్నూర్ ప్రత్యేక వెబ్‌సైట్ (www. abpnarnoor. in) ప్రగతిపై లైవ్ అప్‌డేట్స్–ట్రాకింగ్.
- నార్నూర్ మానిటరింగ్ యాప్, పాఠశాల పరిశీలన–సమస్యల పరిష్కారానికి.
- పైలట్ ప్రజావాణి, బ్లాక్‌స్థాయి సమస్యల పరిష్కారం కోసం వేగవంతమైన వ్యవస్థ.
- స్మార్ట్ సీఎస్‌సీ సెంటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలను డిజిటల్ ద్వారా అందించడం.

స్నేక్ ఈగల్



జన్నారం: ఈ పక్షి పేరు షార్ట్ టోఎడ్ స్నేక్ ఈగల్. చిన్న, చిన్న పాముల నుంచి నాగు పాముల వరకు తన కాలు గోర్లతో పైకి ఎత్తుకెళ్లి ముక్కుతో పొడుస్తుంటుంది. ఐరోపా, ఇండియాలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. వీటి సంఖ్య నేడు తగ్గిపోతుంది. జన్నారం అడవుల్లో ఇది కనిపించింది. పాములు, బల్లులు, చిన్నపాటి కుందేళ్లను కూడా ఇది వేటాడుతుందని అటవీ అధికారులు తెలిపారు.

ఫకీర్‌పేట్ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

సాక్షి స్పందన

ఇచ్చోడ: సిరిచెల్మ అటవీ ప్రాంతంలో 'భారీగా టేకు చెట్లు'నరికివేత శీర్షికన ఈనెల 11న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదించారు. అక్కడి బీట్ అధికారి నిర్లక్ష్యంతో స్మగ్లర్లు టేకు చెట్లను నరికివేసినట్లు గుర్తించారు. శుక్రవారం ఫకీర్‌పేట్ బీట్ అధికారి సుభాష్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు టైగర్‌జోన్ అటవీఅధికారి నాగవత్ స్వామి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

చెన్నూర్: చెన్నూర్‌లోని గోదావరి రోడ్డులో శుక్రవారం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతిచెందింది. మేతకోసం వెళ్లిన ఎద్దు శనిగకుంట సమీపంలో స్తంభం వద్ద వైర్‌కు తగిలి మృతిచెందిందని బాధిత రైతు శంకర్ తెలిపాడు. దీని విలువ రూ.60 వేలు ఉంటుందని పేర్కొన్నాడు.

గ్రూప్–3లో మెరిశారు

టీజీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసిన గ్రూప్–3 ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు ప్రతిభ కనబర్చారు. ఉత్తమ మార్కులతో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఇందులో కొందరు ఉద్యోగం చేస్తూనే ఈ పరీక్ష రాసి సత్తా చాటారు. వీరిని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

- సత్తాచాటిన అభ్యర్థులు
- రాష్ట్రస్థాయిలో మార్కులు

ఉత్తమ ర్యాంకు రావడం సంతోషం



వెంకటేశ్

నస్పూర్: గ్రూప్–3 ఫలితాల్లో నస్పూర్‌కు చెందిన పోలంపల్లి వెంకటేశ్ ఉత్తమ ర్యాంకు సాధించాడు. శ్రీపాదకాలనీకి చెందిన ఈయన 294 మార్కులతో 181 ర్యాంకు సాధించాడు. గ్రూప్–2 ఫలితాల్లో 375 మార్కులతో 337 ర్యాంకు సాధించాడు. 2014లో నిర్వహించిన వీఆర్వో పరీక్ష రాశాడు. ఉమ్మడి జిల్లా టాపర్‌గా నిలిచాడు. కొంతకాలం నస్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో పని చేశాడు. ప్రస్తుతం లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే పరీక్షలకు ప్రిపేరయ్యాడు. ఉత్తమ ర్యాంకు రావడంపై సంతోషంగా ఉందని వెంకటేశ్ తెలిపాడు.

రాష్ట్రస్థాయిలో 417వ ర్యాంకు



అశోక్‌కుమార్..

తాంసి: తాంసికి చెందిన జానకొండ అశోక్ కుమార్ గ్రూప్–3 ఫలితాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించాడు. ఇప్పటికే గ్రూప్–1లో 399 మార్కులు, గ్రూప్–2లో 380 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 250వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్–3లో 284 మార్కులతో రాష్ట్రస్థాయిలో 417వ ర్యాంక్ సాధించాడు. వరుసగా ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్న అశోక్ ప్రస్తుతం జైనథ్ మండలం సుందరగిరి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివానని అశోక్‌కుమార్ తెలిపాడు.

ఉద్యోగమే లక్ష్యంగా..



ఎల్టి కార్తీక్ రెడ్డి

తాంసి: భీంపూర్ మండలం కరంజి(టి)కి చెందిన ఎల్టి కార్తీక్ రెడ్డి 287 మార్కులతో రాష్ట్రస్థాయిలో 326 ర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులు రాధ– సుదర్శన్‌రెడ్డి. వ్యవసాయ కుటుంబం. గ్రూప్–1లో 443 మార్కులు, గ్రూప్–3లో రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించడంతో కార్తీక్‌ను గ్రామస్తులు అభినందించారు.

పట్టుదలతో చదివి..



హరికృష్ణ

మామడ: నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాయత్రిటౌన్ షిప్ కాలనీకి చెందిన లింగాల విజయలక్ష్మి–గోపాల్ దంపతుల కుమారుడు హరికృష్ణ. గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 96వ ర్యాంకు సాధించాడు. బీటెక్ పూర్తి చేసిన హరికృష్ణ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి విజయం సాధించాడు. గ్రూప్–2లో 338వ ర్యాంకు సాధించాడు.

మెరిసిన మలక్‌చించోలి వాసి




దాసరి పవన్ (ఫైల్)

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలికి చెందిన దాసరి పవన్ గ్రూప్–2, 3 ఫలితాల్లో మెరిశాడు. ఈయన తల్లిదండ్రులు దాసరి రమణయ్య–లక్ష్మి. స్థానికంగా వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నారు. గ్రూప్–2లో 667ర్యాంకు, గ్రూప్–3లో 542 ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని పవన్ అంటున్నాడు.

ఇద్దరి ప్రతిభ



ముఖేశ్



ఉదయ్‌కుమార్

బజార్‌హత్నూర్: గ్రూప్–3 ఫలితాల్లో కొలారి గ్రామానికి చెందిన బుద్దేవార్ ముఖేశ్ 304.225 మార్కులతో రాష్ట్రస్థాయిలో 71 ర్యాంకు, బజార్‌హత్నూర్‌కు చెందిన బిట్లింగు ఉదయ్ కుమార్ 304.144 మార్కులతో 74 ర్యాంకు సాధించారు. గ్రూప్–2 ఫలితాల్లో ముఖేశ్ రాష్ట్ర స్థాయిలో 15 ర్యాంకు, ఉదయ్‌కుమార్ 51 ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. గ్రామస్తులు వారిని అభినందించారు.

కడెం యువకుడు..



శశికుమార్

కడెం: గ్రూప్–3 ఫలితాల్లో కడెం మండల యువకుడు ప్రతిభ కనబర్చాడు. చిన్న బెల్లాల్ తండాకు చెందిన భుక్యా యమున–కిషన్ దంపతుల కుమారుడు ఈయన. 306 మార్కులతో ఎస్టీ కోటాలో స్టేట్ ఫస్ట్, జనరల్ కోటాలో 58వ ర్యాంక్ సాధించాడు. కుటుంబ సభ్యులు, మిత్రులు ఆయన్ను అభినందించారు.

పరీక్ష రాస్తే సెలెక్ట్ కావాల్సిందే..



తల్లి పోషక్కతో తిరుపతి

మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రాణహితకాలనీకి చెందిన బొడ్డు పోషక్క–భూమయ్య దంపతుల చిన్న కుమారుడు తిరుపతి. గ్రూప్–4, 2, 3లో ఎంపికై అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. 2016లో సింగరేణిలో జేఎంఈటీ పరీక్ష రాసి ఉద్యోగం సాధించాడు. తర్వాత గ్రూప్–4 పరీక్ష రాసి ఫలితాల్లో సత్తాచాటాడు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గ్రూప్–2లో రాష్ట్రస్థాయి 77 ర్యాంకు, తాజాగా విడుదలైన గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్రస్థాయి 60 ర్యాంకు సాధించడంతో స్థానికులు ఆయన్ను అభినందించారు. గ్రూప్–1 ఉద్యోగం చేయడమే తన లక్ష్యమని తిరుపతి పేర్కొన్నాడు.

సత్తాచాటిన యువకుడు



డోకె సురేశ్

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ కొత్తగూడ గ్రామానికి చెందిన యువకుడు డోకె సురేశ్ గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 199 ర్యాంక్ సాధించాడు. ఈయన తల్లిదండ్రులు అమ్మక్క–రాఘవులు దంపతులు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తూ కుమారుడిని ఉన్నత చదువులు చదివించారు. ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలను సాధించాడు. ఆయన్ను గ్రామస్తులు అభినందించారు.

సింగరేణిలో విధులు నిర్వహిస్తూనే..



కామ్రే భాస్కర్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా స్టోర్స్‌లో సీనియర్ అసిస్టెంట్ కామ్రే భాస్కర్ గ్రూప్–3 ఫలితాల్లో ప్రతిభ చాటుకున్నాడు. కౌటాల మండలం గుడ్లబోరికి చెందిన ఈయన గ్రూప్–2లో 381.065 మార్కులతో రాష్ట్ర స్థాయి 229వ ర్యాంకు, తాజాగా గ్రూప్–3లో 296 మార్కులతో రాష్ట్రస్థాయిలో 154వ ర్యాంకు సాధించాడు. ఓ వైపు సింగరేణి విధులు నిర్వహిస్తూనే మరోవైపు పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యాడు. కృషి, పట్టుదలతో గ్రూప్–2, 3 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి అందరికి ఆదర్శంగా నిలిచాడు.

విజయవంతంగా గిరిజన క్యాంటీన్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజనభవన్‌లో గిరిజన క్యాంటీన్ ఏర్పాటు చేసి నేటికి ఏడాది పూర్తయిందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ గతేడాది మార్చి 15న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క,కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పేదలకు కడుపునిండా భోజనం పెట్టేందుకు క్యాంటీన్ విజయవంతంగా సాగుతుందన్నారు. ప్లేట్ మిల్స్ రూ.5కే అందిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. క్యాంటీన్ ఏర్పాటుతో కొలాం గిరిజనులకు ఉపాధి లభించిందన్నారు.

పండుగ పూట విషాదం

- ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యార్థి మృతి
- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు
- మిన్నంటిన రోదనలు



రుషి కుమార్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. అప్పటివరకు హోలీ సంబరాల్లో స్నేహితులు, కుటుంబీకులతో గడిపిన ఓ విద్యార్థి ద్విచక్రవాహనం అదుపుతప్పి కానరాని లోకాలకు చేరాడు. తమ కుమారుడు లేడన్న నిజాన్ని ఆ కుటుంబీకులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మర్‌వాడకు చెందిన జిల్లెడ్వార్ ఊశన్న మేస్త్రి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ముగ్గురు కుమారులు. చిన్నకుమారుడు జిల్లెడ్వార్ రుషికుమార్ (16) ఆదిలాబాద్ పట్టణంలోని సేవదాస్ విద్యామందిర్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం రుషికుమార్‌తో పాటు మరో ఇద్దరు స్నేహితులు పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన ఆమ్లే ప్రేమ్, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కచ్‌కంటికి చెందిన బడేన్వార్ అశ్విన్‌తో కలిసి హోలీ సంబరాలు చేసుకున్నారు. అనంతరం అశ్విన్‌ను ఇంటివద్ద దింపడానికి ముగ్గురు బైక్‌పై వెళ్లారు. ఆ తర్వాత ఇద్దరు తిరిగి వస్తుండగా పట్టణంలోని ఎరోడ్రాం సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అతివేగంగా నడపడంతో అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా రుషికుమార్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్ర గాయాలపాలైన ఆమ్లే ప్రేమ్ బతికి బయటపడ్డాడు. ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు.



రిమ్స్‌లో రుషికుమార్ మృతదేహం

వారం రోజుల్లో పరీక్షలు ఉండగా..

పదో తరగతి పరీక్షలు వారం రోజుల్లో జరగనున్నాయి. అంతలోనే హోలీ సంబరాల్లో కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. అప్పటివరకు ఇంటి వద్ద హోలీ సంబరాల్లో మునిగితేలిన కుమారుడు తిరిగిరాని లోకాలకు చేరాడన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. విషయం తెలియడంతో తోటి స్నేహితులు, బంధువులు వారి నివాసానికి చేరుకున్నారు. తోటి విద్యార్థులు కంటతడి పెట్టారు. చిన్నప్పటి నుంచి చదువుల్లో ముందంజలో ఉన్న విద్యార్థి మృతి చెందడంతో పాఠశాల యాజమాన్యం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మరో విద్యార్థికి గాయాలతో బతికి బయటపడ్డాడు.

విద్యుత్ ఉచ్చులకు వేటగాడి బలి



పాల్కు రమేశ్ మృతదేహం

రెబ్బెన: అడవి జంతువులను వేటాడేందుకు పొలంలో విద్యుత్ తీగలకు ఉచ్చు బిగుస్తుండగా వేటగాడు బలయ్యాడు. మండలంలోని నారాయణపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీకి చెందిన పాల్కు రమేశ్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అప్పుడప్పుడు అడవి జంతువులను వేటాడేవాడు. గురువారం రాత్రి బయటకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరాడు. గ్రామానికి చెందిన గోలెం పెంటయ్య వ్యవసాయ పొలంలో అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ వైర్లు అమర్చాడు. విద్యుత్ సరఫరా అందించే క్రమంలో వైరు తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తెల్లవారిన తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. పొలంలో ఎవరో పడిపోయి ఉన్నాడని గ్రామస్తుడు తోట నవీన్.. రమేశ్ కుమారుడికి తెలిపాడు. అక్కడికి వెళ్లి చూడగా రమేశ్ పడిపోయి ఉన్నాడు. ఘటన స్థలంలో ఆయన ఒంటిపై కరెంట్ తీగ చుట్టుకుని ఎడమ చేతిలో కరెంట్ తీగ పట్టుకుని, కుడి చేతిలో కర్ర ఉన్నట్లు గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్.. మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేబుల్ వైర్ల దొంగల ముఠా అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

నిర్మల్‌రూరల్: కేబుల్ వైర్ల దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన ఐదుగురు దొంగలు శుక్రవారం మండలంలోని ఎల్లపల్లి శివారులో మోటార్ కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారు. రూరల్ ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో కొండాపూర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వీరు అనుమానాస్పదంగా కనిపించారు. వాహనం తనిఖీ చేయగా అందులో కేబుల్ వైర్లు లభ్యమయ్యాయి. దీంతో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.